05ATP18_05ATP18.qxd 18-02-2025 PM 11:48 Page 1



# క్షేత్రస్థాయిలో రీ సర్వే అర్జీని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

- అర్జీదారుడి భూమి సబ్ డివిజన్ చేపట్టడంపై సమగ్రంగా జిల్లా కలెక్టర్ పరిశీలన
- సబ్ డివిజన్ సర్వే పక్కాగా చేపట్టాలి - జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్



రీ సర్వేను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

**పుట్లూరు, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త**

క్షేత్రస్థాయిలో రీ సర్వే అర్జీని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ తనిఖీ చేశారు. మంగళవారం సాయంత్రం పుట్లూరు మండలంలోని సూరేపల్లి గ్రామ పరిధిలో రీ సర్వే అర్జీని జిల్లా కలెక్టర్ పరిశీలించి అర్జీదారుడి భూమి సబ్ డివిజన్ చేపట్టడంపై సమగ్రంగా పరిశీలించారు. సూరేపల్లి గ్రామానికి చెందిన వి.రామచంద్ర అనే వ్యక్తి 2024 అక్టోబర్ 19న నిర్వహించిన రీ సర్వే గ్రామసభలో సర్వేనెంబర్ 123, 140లో వున్న 6.04 ఎకరాల భూమి జాయింట్ ఎల్‌పిఎంలో వుందని తమ తల్లి భాగ్యమ్మ, రామచంద్ర, సంజీవ్ పేరిట సబ్ డివిజన్ చేయాలని అర్జీని అందించారు. తమకు ఎటువంటి ప్రభుత్వ పథకాలు, బ్యాంకు రుణాలు రాలేదని, సబ్ డివిజన్ చేయాలని కోరారన్నారు. ఈ విషయమై తహశీల్దార్, మండల సర్వేయర్ విచారణ చేసి భాగ్యమ్మ పేరిట 2.02 ఎకరాలు, రామచంద్ర పేరున 2.01 ఎకరాలు, సంజీవ పేరిట 2.01 ఎకరాలను సబ్ డివిజన్ చేయడం జరిగింది. ఇందుకు సంబంధించి జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పర్యటన చేసి అర్జీదారుని భూమి సబ్ డివిజన్ చేపట్టడంపై సమగ్రంగా వివరాలు ఆరా తీశారు. అర్జీదారునితో మాట్లాడుతూ మీరు ఎంత మంది అన్నదమ్ములు, రీ సర్వే గ్రామసభ ఎప్పుడు జరిగింది. ఎందుకు విడిపోవాలని అనుకున్నారు. తదితర పూర్తి స్థాయి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామ మ్యాప్‌ను పరిశీలించారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ రీ సర్వే అర్జీలకు సంబంధించి సబ్ డివిజన్ పక్కాగా చేపట్టాలని ఆదేశించారు. అర్జీదారులకు ఇచ్చే సబ్ డివిజన్ సర్వేకు సంబంధించిన నోటీసులో సర్వే అండ్ బౌండరీ ఫిక్స్ చేయాలన్నారు. నోటీసుల సమయం 7 రోజులు ఇవ్వాలని, నోటీసులను సంబంధిత గ్రామ సచివాలయంలో అతికించాలన్నారు. అర్జీదారులు వారి కుటుంబసభ్యులు తప్పనిసరిగా హాజరయ్యేలా చూడాలన్నారు.

అర్జీదారు పొలం చుట్టుపక్కల రైతులు కూడా సర్వే సమయంలో వచ్చేలా తెలియచేయాలన్నారు. వండల సర్వే రిపోర్టు కూడా వుండాలన్నారు. సబ్ డివిజన్ స్కెచ్ డిఐఒ స్క్రుటీని చేయాలన్నారు. సర్వే అండ్ బౌండరీ యాక్ట్‌కు సంబంధించి ఎఫ్ఎంబి అప్‌డేట్ చేయాలన్నారు. అర్జీదారుడు లిఖితపూర్వకంగా సంతకం చేసేలా చూడాలని ఆదేశించారు. అనంతరం పూర్తి వివరాలు వున్న తరువాత సబ్ డివిజన్ చేపట్టాలని ఆదేశించారు. ఇందులో ఎలాంటి లోటుపాట్లకు తావివ్వరాదని పకడ్బంధీగా అన్ని వివరాలతో సబ్ డివిజన్ పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ఆర్డీఒ కేశవనాయుడు, తహశీల్దార్ శేషారెడ్డి, డిఐ వేణుగోపాల్‌గుప్తా, మండల సర్వేయర్ శాంతి, విఆర్ఒ వెంకటేశ్వరరావు, విఆర్‌ఏ కొండప్ప, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులతో ప్రేమానురాగాలతో పలకరించాలి

- డివిజన్ బిసి వెల్ఫేర్ అధికారి బాలాజి



వార్డెన్లు, 4వ తరగతి ఉద్యోగుల సమావేశంలో మాట్లాడుతున్న ఏబిసి డబ్ల్యూ బాలాజి

**కదిరి, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త**

బిసి సంక్షేమ వసతి గృహాల్లో విద్యను అభ్యసిస్తున్న బాల, బాలికల పట్ల సంక్షేమ వసతి గృహాల వార్డెన్లు, 4వ తరగతి ఉద్యోగులు ప్రేమానురాగాలతో పలకరించాలని కదిరి డివిజన్ ఏబిసి డబ్ల్యూ బాలాజీ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని డివిజన్ కార్యాలయంలో వార్డెన్లు, 4వ తరగతి ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు, భోజన పథకం నిర్వాహణపై అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల పట్ల ఆప్యాయంగా ఉంటూ వారిని వారి విద్యాభివృద్ధికి ప్రోత్సహించాలన్నారు. దురుసుగా ప్రవర్తిస్తే క ఠిన చర్యలు తప్పవన్నారు. ఎప్పటికప్పుడు విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న మెనూను ప్రతి హాస్టల్లలో అమలు చేయాలన్నారు. రాత్రి సమయంలో విద్యార్థులకు హెచ్‌డబ్ల్యూలు, 4వ తరగతి ఉద్యోగులు అందుబాటులో ఉండి వారి విద్యాభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలని ఆయన సూచించారు. సమావేశంలో వార్డెన్లు జయరామిరెడ్డి, రవీందర్‌రెడ్డి, లీలావతి, షబానా, అంజినాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను సన్మానిస్తున్న మత్స్యకార సంఘం ప్రెసిడెంట్ నాగరాజు



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న మత్స్యకార సంఘం ప్రెసిడెంట్ నాగరాజు

**తనకల్లు, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త**

మండల పరిధిలోని దేవళం తండాకు చెందిన వవాయలపాటి నాగరాజును సిజి ప్రాజెక్టు మత్స్యకార సంఘం అధ్యక్షులుగా ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకార సంఘంలో ఉన్న సభ్యులందరినీ కలుపుకొని అందరూ పనిచేస్తామని అంతేకాకుండా మాపై నమ్మకంతో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌కు మేమందరము రుణపడి ఉన్నామని ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరికీ తోడుగా ఉంటానని నా కర్తవ్యాన్ని నేను నెరవేరుస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో దేవళం తాండ బి సీనా నాయక్, సెక్రటరీ శ్రీరాములు, గోపాల్ నాయక్, మునుస్వామి నాయక్, కల్లి కిష్టప్ప, జి.వెంకటరమణ కందుకూరి రెడ్డప్ప, రాము నాయక్, నాగె నాయక్, సీతారాం నాయక్, పెద్దరెడెప్ప, బాలు నాయక్, బి.కృష్ణ నాయక్, శంకర్ నాయక్, వాయలపాటి సీనప్ప, రంగనాయక్, లవన్న నాయక్, చలపతి, తిప్పన్న నాయక్, చలపతి నాయక్, తిప్పన్న నాయక్, చంద్ర నాయక్, సుధాకర్, నర్సింహులు, కోతు కిష్ట తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయం ఉద్యోగులు తప్పకుండా రోజువారి బయోమెట్రిక్ అటెండెన్స్ వేయాలి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్



వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్

**పుట్లూరు, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త**

సచివాలయం ఉద్యోగులు తప్పకుండా రోజువారి బయోమెట్రిక్ అటెండెన్స్ వేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం పుట్లూరు మండలంలోని అరకటివేముల గ్రామ సచివాలయంలో జిఎస్‌డబ్ల్యుఎస్‌పై జెడ్‌పి సిఇఒ రామచంద్రారెడ్డి, డిపిఒ నాగరాజునాయుడు, డిఎల్‌డిఒలు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమీషనర్లు, తదితరులతో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులందరూ తప్పనిసరిగా రోజువారి బయోమెట్రిక్ అటెండెన్స్ వేయాలని ఆదేశించారు. హౌస్ హోల్డ్ మిస్సింగ్ సిటిజెన్‌కు సంబంధించి ప్రతి ఫంక్షనరీ రోజుకు రెండు చొప్పున మొత్తం పెండింగ్ పూర్తి అయ్యే వరకు చేపట్టాలన్నారు. హౌస్ టు హౌస్ జియో. కోర్డినేట్స్‌కు సంబంధించి ప్రతి ఫంక్షనరీ రోజుకు రెండు చొప్పున పెండింగ్ పూర్తి చేయాలన్నారు. వివిధ రకాల సేవలకు సంబంధించిన సర్వీసులు అమౌంట్‌లను రెండు రోజుల్లో ప్రభుత్వానికి జమ చేయాలని కార్యదర్శులను ఆదేశించారు. నాన్ రెసిడెంట్ ఆఫ్ ఏపికి సంబంధించి ప్రతి ఫంక్షనరీ రోజు 25 చొప్పున మొత్తం పెండింగ్ సకాలంలో చేయాలని ఆదేశించారు. చిల్డ్రన్ విశౌట్ ఆధార్‌కి సంబంధించి మొత్తం పెండింగ్ రెండు రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ఆర్డీఒ కేశవనాయుడు, తహశీల్దార్ శేషారెడ్డి పాల్గొన్నారు.

## శ్రీభ్రమరాంబికా మల్లికార్జునస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే జె.సి



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే జె.సి

**తాడిపత్రిటౌన్, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త**

పట్టణ సమీపంలోని కడపరోడ్డులో వెలసిన శ్రీభ్రమరాంబికా మల్లికార్జున స్వామిని మంగళవారం ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి దర్శించుకున్నారు. ఆలయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే జె.సి ముఖ్యఅతిథిగా హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు గావించారు. అనంతరం అర్చకులు ఎమ్మెల్యే జె.సికి స్వామివారి ప్రసాదాలను అందచేసి ఆశీర్వదించారు.

## చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఇంటర్ విద్యార్థి శ్రీకాంత్

**అనంతపురం రూరల్,ఫిబ్రవరి18ప్రభాతవార్త:**



నగర శివారులో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న విద్యార్థి శ్రీకాంత్

అనంత రూరల్ మండలం ఆలమూరు గ్రామ సమీపంలో గల ఎస్సాఆర్ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఎంపిసి మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి శ్రీకాంత్ సమీపంలోని ఒక తోటలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివారాలు ఈ విధంగా ఉన్నాయి ధర్మవరం మండలం మల్కాపురం గ్రామానికి చెందిన గొర్రెల కాపారి పెద్ద అక్కులప్ప నారాయణమ్మలకు ఇద్దరు కుమారులు కలరు పెద్ద కుమారుడు గ్రామంలోనే గొర్రెలు కాసుకుంటు జీవించడం జరుగుతుండడంతో రెండవ కుమారుడైన శ్రీకాంత్‌ను అనంత రూరల్ మండలం ఆలమూరు సమీపంలోని ఎస్సాఆర్ జూనియర్ కళాశాలలో ఈ సంవత్సం ఎంపిసిలో చేర్చడం జరిగిందని కళాశాలలో చదువుతున్న విద్యార్థి శ్రీకాంత్ సోమవారం రాత్రి కళాశాల హస్టల్ నుంచి బయటికి వచ్చి సమీసంలోని ఒక తోటలో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకోవడం జరిగిందని ,విద్యార్థి ఆత్మహత్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. కాగ విద్యార్థి ఆత్మహత్యకు గల ఎస్సాఆర్ కళాశాలపై చర్యలు తీసుకుని వెంకటనే ఆ కళాశాలను సీజ్ చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు, ఆత్మహత్య చేసుకున్న విద్యార్థి శ్రీకాంత్ తల్లిదండ్రులతో కలసి కళాశాల సమీపంలో ధర్నా నిర్వహించారు.

## రీ సర్వేలో రైతులకు సూచనలు ఇచ్చిన ఆర్డీఒ



రీ సర్వేలో రైతులకు సలహాలు ఇస్తున్న ఆర్డీఒ

**యాడికి, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త**

మండలంలోని దైవాలమడుగు గ్రామంలో మంగళవారం గుంతకల్లు రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాస్ సందర్శించి రీ సర్వేపై రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు. గ్రామ సర్వే నెంబర్ 435లో జరుగుతున్న రీ సర్వే కార్యక్రమాన్ని సందర్శించి రీ సర్వే గ్రామ టీములకు సలహాలు అందించారు. గ్రామ రైతులకు రీ సర్వే సాముఖ్యతను తెలియచేస్తూ భూమికి సంబంధించి ఏ సమస్య అయినా రీ సర్వేలో పరిష్కరించుకోవడానికి అవకాశం వుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే గుంతకల్లు చంద్రశేఖర్‌రెడ్డి, రీ సర్వే డిప్యూటి తహశీల్దార్ రాజ్‌కుమార్, మండల సర్వేయర్ శేషసాయి, గ్రామ రెవెన్యూ అధికారులు నరసింహరాజు, రాందాస్, గ్రామ సర్వేయర్ రాజశేఖర్‌రెడ్డి, సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## బిజెపి మండల సమావేశం



సమావేశంలో పాల్గొన్న బిజెపి నాయకులు

**అమడగూరు, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త**

భారతీయ జనతాపార్టీ సత్యసాయి జిల్లా అధ్యక్షులు జిఎం శేఖర్ ఆదేశాల మేరకు అమడగూరులో మంగళవారం బిజెపి మండల అధ్యక్షులు రామిశెట్టి వేమ నారాయణ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల శ్రీనివాసులు, ఆర్ఒలు శరత్‌కుమార్‌రెడ్డి, హరినాయక్, సీనియర్ నాయకులు ఐ.రాము, రఘునాథ్‌రెడ్డి, సుబ్బిరెడ్డి, సురేందర్‌రెడ్డి, జైచంద్రరెడ్డి, జిల్లా కార్యవర్గసభ్యులు గంగుల గారి రామయ్య, ఉత్తప్ప, మహిళా మోర్చా అధ్యక్షురాలు సుభద్రమ్మ, లీలావతి, సరస్వతి, తిప్పన్న, పురుషోత్తం, చంద్రశేఖర్, వెంకటరమణ, హరీష్, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడి టీచర్లకు శిక్షణ



అంగన్‌వాడివర్కర్లకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

**అమడగూరు, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త**

మండలంలోని అంగన్‌వాడిటీచర్లకు జ్ఞానజ్యోతి 120 డేస్ సర్టిఫికెట్ కోర్సు కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని జెడ్‌పిహెచ్‌ఎస్‌లో మంగళవారం శిక్షణ నిర్వహించారు. ఎన్ఇపి 2020లో భాగంగా అంగన్‌వాడి టీచర్లకు పిపి 1, పిపి 2 విద్యార్థుల బోధనా పద్దతులపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ-1 జిలాన్‌బాష, ఎంఇఒ-2 సంపూర్ణ, జెడ్‌పిహెచ్‌ఎస్ హెచ్‌ఎం శ్రీధర్‌బాబు, సూపర్‌వైజర్ గంగాదేవి, ఆర్‌పిలు జి.ధనుంజయ, డి.నారాయణస్వామి, మంజునాథ్, అంగన్‌వాడి టీచర్లు పాల్గొన్నారు.

## పురుగుల మందు సేవించి వ్యక్తి ఆత్మహత్య

**యల్లనూరు, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త**

మండలంలోని పెద్దమల్లేపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాస్‌నాయుడు (62) అనే వ్యక్తి పురుగులమందుసేవించి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఏఎస్ఐ సంపత్ తెలిపారు. ఏఎస్ఐ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. శ్రీనివాస్‌నాయుడు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండేవాడు. జీవితంపై విరక్తి చెంది తన పాత ఇంటిలో పురుగులమందు సేవించి తన స్నేహితుడు చంద్రమౌళేశ్వర్‌రెడ్డికి ఫోన్ చేసి తాను పురుగులమందు సేవించిన విషయాన్ని తెలిపాడు. దీంతో చంద్రమౌళేశ్వర్‌రెడ్డి అంబులెన్స్‌ను తీసుకొచ్చి శ్రీనివాస్‌నాయుడును తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తీసుకుని రాగా డాక్టర్ పరీక్షించి శ్రీనివాస్‌నాయుడు మృతి చెందినట్లు తెలిపారు. దీంతో శ్రీనివాస్‌నాయుడు కుమారుడు మధుసూదన్ నాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

## అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ కార్యక్రమం

**నంబులపూలకుంట, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త**

అంగన్‌వాడీ టీచర్లకు జ్ఞాన జ్యోతి పేరిట 120 రోజుల సర్టిఫికెట్ కోర్సులో భాగంగా 6 రోజుల శిక్షణ తరగతులు జడ్పిహెచ్‌ఎస్ ఎన్‌పి కుంటలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బి.గోపాల్‌నాయక్, సుబ్బిరెడ్డి హై స్కూల్ హెచ్‌ఎం, డిఆర్‌పిలు జిల్లా రీసోర్స్ పర్సన్స్ శిరీష, (ఎం.చిన్నరెడ్డప్ప, ఎం.మహేష్‌రెడ్డి, నాగేంద్ర) సూపర్‌వైజర్స్ నరసమ్మ, మౌలాబి, అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మిలు పాల్గొన్నారు.

## ఈ నెల 23న ఎమ్మార్పిఎస్ ఎంఎస్‌పి ఎంఈఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం



మీడియాతో మాట్లాడుతున్న ఎంఈఎఫ్ నాయకులు

**కదిరి, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త**

ఈ నెల 23న ఉమ్మడి అనంతపురం జిల్లా కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎమ్మార్పిఎస్, ఎంఈఎఫ్ అనుబంధ సంఘాల కార్యవర్గ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షులు నాగేంద్రనాథ్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో నాయకులు మాట్లాడుతూ.. ఉమ్మడి అనంతపురం జిల్లా కేంద్రంలో జరిగే రాష్ట్ర కార్యవర్గ అత్యవసర సమావేశానికి ముఖ్య అతిథిగా పద్మశ్రీ పురస్కార గ్రహీత మందకృష్ణ మ ఆదిగ హాజరవుతారన్నారు. ఏపిలో వర్గీకరణ అమలుకై జరుగుతున్న పరిణామాలపై కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, సమావేశం గుత్తి రోడ్డులోని బళ్లా కన్వెన్షన్ హాలులో నిర్వహిస్తున్నామన్నారు. కావున సమావేశంలో ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు విశ్వనాథ్, చిన్నప్పయ్య, రామకృష్ణలు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీలకు జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమం



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఇఒ

**యల్లనూరు, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని జెడ్‌పిహెచ్‌ఎస్ పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమం మంగళవారం నుండి ప్రారంభమైంది. ఈ శిక్షణా కార్యక్రమం ఈ నెల 25వతేదీ వరకు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా మండలంలోని 43 మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు పిల్లల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నైపుణ్యాలు, న్యూట్రీషియన్, భాషాభివృద్ధి వంటి మెలకువలపై అవగాహన కల్పించారు. ఈ నెల 21,23 తేదీల్లో శిక్షణ కార్యక్రమం వుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్, మండల విద్యాశాఖాధికారులు చంద్రశేఖర్, పరమేశ్వర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు రత్నమ్మ, రీసోర్స్ పర్సన్లు గిరిధర్‌రెడ్డి, చెన్నారెడ్డి, విశ్వనాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఓబులేసుకోనలో స్వాతినక్షత్రం పూజలు

**తాడిపత్రిరూరల్, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త**



మండలంలోని ఓబులేసుకోనలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం స్వామివారి జన్మనక్షత్రం స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని ఉదయం అర్చకులు ఇంద్రస్వామి స్వామివారికి సుప్రభాతసేవ, నవకలశ స్నపన, తిరుమంజనసేవ, తోమాలసేవ, సహస్ర నామార్చానసేవ, మహా నివేదన శాత్తుమొరై, మహామంగళహారతి, తీర్థప్రసాద విని యోగము, తదితర పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి కళ్యాణోత్సవాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా కన్నులపండువగా నిర్వహించారు. అనంతరం ప్రాకారోత్సవం, తదితర పూజా కార్య క్రమాలను నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి ఉత్సవ విగ్రహాలను పల్లకిలో వుంచి గోవింద నామస్మరణ మధ్య ఆలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. హాజరైన భక్తులకు అన్నదాన కార్య క్రమాన్ని ఏర్పాటు చేశారు.

## చికోటి ప్రవీణ్‌ను కలిసిన బిజెపి నాయకులు




ప్రవీణ్‌కు స్వామివారి చిత్రపటం అందచేస్తున్న దృశ్యం

**తాడిపత్రిటౌన్, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త**

తెలంగాణ బిజెపి హిందుత్వాది చికోటి ప్రవీణ్‌ను తాడిపత్రి బిజెపి నాయకులు కలిశారు. గుంతకల్లు పట్టణంలో మంజుల వెంకటేష్ ఆధ్వర్యంలో శివాజీ జయంతి సందర్భంగా బైకు ర్యాలీ ఏర్పాటు చేసిన సందర్బంగా చికోటి ప్రవీణ్‌ను అనంతపురం జిల్లా వాణిజ్య సెల్ కన్వీనర్ శేషఫణి, బిజెపి తాడిపత్రి పట్టణాధ్యక్షులు కృష్ణమోహన్‌రాజు, గోవిందప్పలు కలిసి హనుమాన్ జ్ఞాపికనఅందచేశారు.

## అంగన్వాడీలకు జ్ఞానజ్యోతి శిక్షణా తరగతులు



అంగన్వాడీలకు అవగాహన కలిగిస్తున్న ట్రైనర్లు

**ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త**

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఈఓ లు సురేష్, రమణ, ఐసిడిఎస్ సూపర్వైజర్ విజయ్ కుమారిల ఆధ్వర్యంలో మంగళవారం అంగన్వాడీలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. మూడు సంవత్సరాల వయసు మొదలు ఎనిమిదేళ్ల చిన్నారుల్లో చదువు పట్ల ఆసక్తి పెంచడమే జ్ఞాన జ్యోతి ఉద్దేశమన్నారు. అంగన్వాడీలను బలోపేతం చేసి చిన్నారుల్లో చదువు పట్ల ఆసక్తిని పెంచి మెరుగైన ఫలితాలు సాధించడం కోసం ప్రభుత్వం జ్ఞాన జ్యోతి కార్యక్రమాన్ని రూపొందించిందని వారు తెలిపారు. 120 రోజులు పాటు కార్యక్రమాలు ఉంటాయన్నారు. ప్రస్తుతం పూర్వ ప్రాథమిక విద్య విధానం ద్వారా ఆరు రోజులపాటు అంగన్వాడీలకు ట్రైనర్ల ద్వారా ప్రత్యేక శిక్షణ తరగతులు ఏర్పాటు చేశామన్నారు. మొదటిరోజు శిక్షణ తరగతులను సర్వ శిక్ష అభియాన్ ఏ ఎం ఓ బ్రహ్మానంద రెడ్డి, డిసిఒ సంపూర్ణలు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ట్రైనర్లు జెడ్ రవి, లక్ష్మీ నరసప్ప, అమర్నాథ్, రామ్ కుమార్ లు పాల్గొన్నారు.

## పొలంబడి రైతులకు శిక్షణ కార్యక్రమం



రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**నంబులపూలకుంట, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త**

వంకమద్ది గ్రామ పంచాయితీ పరిధిలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇండిగ్యాప్ సర్టిఫికేషన్ ద్వారా మేలైన యాజమాన్య పద్దతులు విత్తనం నుంచి అమ్మకం వరకు వివరించారు. ఇండిగ్యాప్ సర్టిఫికేషన్ ద్వారా నాణ్యమైన పంటను పొంది దానికి విలువ ఆధారిత ఉత్పత్తులను పొంది ఆ ఉత్పత్తులకు దృవీకరణ ద్వారా (స్కోప్ సర్టిఫికేషన్) ఆన్లైన్ మార్కెటింగ్ ద్వారా రైతులు ఆధాయం రెట్టింపు అవుతుందన్నారు. ఈ ఇండిగ్యాప్ సర్టిఫికేషన్ ద్వారా పొందే ఉత్పత్తులలో తక్కువ శాతం క్రిమి, రసాయన అవశేషాలు ఉండడం ద్వారా ఆరోగ్యమైన పంటలను పండించాలని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్.సత్యనారాయణ సహాయ వ్యవసాయ సంచాలకులు కదిరి, వి.లోకేశ్వరరెడ్డి, మండల వ్యవసాయ అధికారి శశిరేష-వ్యవసాయ విస్తరణాధి కారి, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## బీసీ కార్పొరేషన్ నుండి రుణాల ఇంటర్వ్యూ



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

**తనకల్లు, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త**

తనకల్లులోని ఎంపీడీవో కార్యాలయం నందు బీసీ కార్పొరేషన్ అప్లై చేసుకున్న వారికి ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ సరిహద్దులోకల గ్రామాలకు ఇంటర్వ్యూలు నిర్వహించడం జరిగింది. ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ రాజశేఖర్ రెడ్డి, ఎంపీడీవో రెడ్డప్ప, ఇన్చార్జ్ ఈఓఆర్డి కృష్ణమూర్తి రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్బంగా ఎంపీడీవో మాట్లాడుతూ వెనుకబడిన వర్గాల వారికి స్వయం ఉపాధి కలిగించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ రుణాలు అందిస్తున్నది తెలిసిందే. ఈ బీసీ కార్పొరేషన్ రుణాల కొరకు నమోదు చేసుకున్న మండల ప్రజలకు బీసీ రుణాల ద్వారా వారికి ఆర్థిక చేయూత అందించి స్వయం ఉపాధి కల్పించే ప్రయత్నంలో భాగంగా ప్రభుత్వం బీసీలపై పెద్దపీఠం వేశారన్నారు. ఈ ఇంటర్వ్యూలకు ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు కు సంబంధించిన చీకటి మానిపల్లి, బొంతలపల్లి, తవళం, దిగువ తొట్లిపల్లి, కోటిపల్లి, మల్రెడ్డిపల్లి, బాలసముద్రం గ్రామాలకు సంబంధించి 106 మంది రుణాల కొరకు నమోదు చేసుకోగా వాటిలో 84 మంది ఇంటర్వ్యూకు హాజరయ్యారని మంగళవారం నిర్వహించిన ఇంటర్వ్యూ ప్రశాంతంగా నిర్వహించామని తెలిపారు.

## శ్రీకోనవీరాంజనేయస్వామికి అభిషేకాలు

**తాడిపత్రిరూరల్, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త**

మండలంలోని ఆలూరుకోనలో వెలసిన శ్రీకోనవీరాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాఘమాసం పురస్కరించుకుని ఉదయం స్వామివారికి అర్చకులు అభిషేకాలు, అర్చనలు, తదితర పూజలు నిర్వహించారు. అనంతరం పలువురు భక్తులు స్వామివారికి ఆకుపూజలు చేయించారు. పెద్దఎత్తున భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. అదేవిధంగా శ్రీరంగనాథస్వామి, శ్రీషిరిడిసాయి బాబాను దర్శించుకుని పూజలు నిర్వహించారు. హాజరైన భక్తులు అన్నదాన సత్రంలో భోజనాలు చేశారు.

06ATP27_06ATP27.qxd 18-02-2025 PM 10:22 Page 1



## నియోజక వ్యాప్తంగా త్రాగునీటి సమస్య లేకుండా చూడాలి



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాజీ ఎమ్మెల్సీ

మడకశిర ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:

నియోజకవర్గ వ్యాప్తంగా వేసవిలో త్రాగునీటికి ప్రజలు ఎటువంటి ఇబ్బందులు పడకుండా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే ఎం ఎస్. రాజు ఆదేశించారు. వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణ చర్యల్లో భాగంగా సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని మడకశిర నియోజకవర్గ ఎమ్మెల్యే, టిటిడి పాలకమండలి సభ్యులు ఎం.ఎస్. రాజుగారు హెచ్చరించారు. స్థానిక ఆర్ అండ్ బి విశ్రాంతి భవనం లో మంగళవారం ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, తెదేపా రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో ఆర్ డబ్ల్యూఎస్, ఎంపీడిఓలు, పీఆర్ శాఖల అధికారులతో వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. త్రాగునీటి సమస్యను తీర్చేందుకు వచ్చిన నిధులను కేవలం తాగునీటి కోసమే ఖర్చు చేయాలని ఇతర పనులకు వినియోగించరాదని అధికారులకు ఆదేశించారు. నియోజకవర్గంలోని 5 మండలాల్లో త్రాగునీటి సమస్య ఉందని ఎవరైనా రోడ్డెక్కితే అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. తాగునీటి సమస్య పరిష్కారానికి కావాల్సిన నిధులు, ఇతర సౌకర్యాల కల్పన కోసం నియోజకవర్గం ఎమ్మెల్యేగా రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో మాట్లాడి తోడ్పాటు అందిస్తానని తెలియజేశారు. గ్రామాల్లో ఉన్న రక్షిత మంచినీటి పథకాలతో పాటు శ్రీరామ రెడ్డి త్రాగునీటి పథకం ద్వారా వచ్చే త్రాగునీటిని కూడా వినియోగించుకుని సమస్య లేకుండా చూడాలన్నారు. పంచాయతీల్లో ఉన్న ప్రతి ఎన్టీఆర్ సుజల స్రవంతి త్రాగునీటి శుద్ధ జల కేంద్రాలను వెంటనే పనిచేసేలా చేసి ప్రజలకు శుద్ధమైన తాగునీరు అందించాలని ఆదేశాలు జారీ చేశారు.

## ఆరోగ్యశ్రీ రోగుల పట్ల మర్యాద చూపండి

### నియోజకవర్గం లో మంత్రికి చెడ్డపేరు తేవద్దు

బత్తలపల్లి, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త



ఆరోగ్యశ్రీ వార్డులో చికిత్స పొందుతున్న బాధితుడిని పరామర్శిస్తున్న హరీష్ బాబు తదితరులు

ఆరోగ్యశ్రీ పథకంలో చికిత్సలు పొందే రోగుల పట్ల దురుసుగా ప్రవర్తించకుండా మర్యాద చూపాలని మంత్రి సత్య కుమార్ యాదవ్ వ్యక్తిగత సహాయకులు హరీష్ బాబు ఆరోగ్య మిత్రలకు సూచించారు. మంగళవారం మండల కేంద్రమైన బత్తలపల్లిలోని ఆర్డిటి ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ పథకం కింద ఆర్తో వార్డులో చికిత్స పొందుతున్న పోట్లమర్రి గ్రామానికి చెందిన కుమ్మర మదనాపు ఆదినారాయణను బిజెపి నాయకులతో కలిసి హరీష్ బాబు పరామర్శించి ప్రమాదం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆరోగ్యశ్రీ పథకంలో రోగుల పట్ల కుటుంబీకుల పట్ల ఆరోగ్య మిత్రలు వ్యవహరిస్తున్న తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యశ్రీ రిజిస్ట్రేషన్ సమయంలో ఆరోగ్య మిత్ర బాలాజీ వ్యవహరించిన దురుసు ప్రవర్తనపై హరీష్ బాబు దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే సంబంధిత ఆరోగ్య మిత్ర జిల్లా కోఆర్డినేటర్ శ్రీదేవితో ఫోన్లో ఆరోగ్య మిత్ర వ్యవహార శైలిపై వివరణ కోరారు. ఆరోగ్య మిత్ర దురుసు ప్రవర్తన వల్ల, పత్రికలలో ఆరోగ్యశ్రీ అమలుపై వ్యతిరేకత వార్తలు వస్తే ధర్మవరం నియోజకవర్గం ఎమ్మెల్యే, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కు చెడ్డపేరు వస్తుందని హెచ్చరించారు. సిబ్బంది పనితీరు, విధులలో అలసత్వం విడనాడి ఆరోగ్య శ్రీ పథకంకు అపవాదులు రాకుండా విధులు నిర్వర్తించాలని హితవు పలికారు. ఆసుపత్రికి వచ్చినప్పుడు రోగులు బాధల లో ఉంటారని వారి పట్ల మానవత్వాన్ని కనబరిచి మంచి మనసుతో వివరాలు తెలుసుకొని ఆరోగ్యశ్రీ రిజిస్ట్రేషన్ చేయాలని ఆరోగ్య మిత్రలకు సూచించారు. బత్తలపల్లి ఆర్డిటి ఆసుపత్రిలో ఇప్పటికే పలుమార్లు ఆరోగ్య మిత్రల పట్ల ఫిర్యాదులు అందాయని ఇప్పటికైనా పద్ధతులు మార్చుకొని విధులు నిర్వర్తించి ఆరోగ్యశాఖకు, మంత్రి సత్య కుమార్ యాదవ్ కు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. మంత్రి వ్యక్తిగత సహాయకులు హరీష్ బాబు వెంట మండల బిజెపి కన్వీనర్ ఆకులేటి భాస్కర్, కావేటి మల్లికార్జున, డి. చెర్లోపల్లి నారాయణస్వామి, ధర్మవరం పట్టణ బిజెపి అధ్యక్షులు జింకా చంద్రశేఖర్, సాకే ఓబులేసు, పోతుకుంట రాజు, రాధాకృష్ణ, రామాంజనేయులు, చిన్న లింగమయ్య పెద్ద లింగమయ్య తదితరులున్నారు.

## అంగన్‌వాడీ టీచర్లకు జ్ఞాన జ్యోతి పేరుతో శిక్షణ

### - ముఖ్య అతిథిగా హాజరైన జడ్పిటిసి



శిక్షణ నిర్వహిస్తున్న దృశ్యం

అగళి, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త

మంగళవారం నుంచి అంగన్‌వాడీ టీచర్లకు జ్ఞానజ్యోతి పేరుతో ప్రభుత్వం శిక్షణతరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ చంద్రశేఖర్ నాయుడు తెలిపారు. ఈ శిక్షణ తరగతులు ఆరు రోజులపాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ తరగతుల ప్రారంభ కార్యక్రమానికి, జడ్పిటిసి ఉమేష్ హాజరయ్యారు. అదే విధంగా సీనియర్ సహాయకులు గుర్రన్న, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లీలావతి, ఆర్‌పిలు వలి, ఈరన్నలు హాజరయ్యారు. మొత్తం శిక్షణ తరగతులకు 47 మంది అంగన్‌వాడీ టీచర్లు హాజరైనట్లు ఎంఈఓ తెలిపారు.

## రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారి సర్టిఫికెట్ల పరిశీలన

పెనుకొండ ఫిబ్రవరి 18 ప్రభాతవార్త




విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీడీవో నరేష్ కృష్ణ

రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఈ బీసీ రుణాల కోసం దరఖాస్తు చేసిన లబ్ధిదారుల సర్టిఫికెట్ల పరిశీలన ఈనెల 20 తేదీన మండల పరిషత్ కార్యాలయము నందు జరుగుతుందని అందుకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు హాజరుకావాలని ఎంపీడీవో నరేష్ కృష్ణ తెలిపారు మండలంలోని గ్రామ పంచాయతీల వారీగా దరఖాస్తు చేసుకున్న వారు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని ఆయన తెలిపారు బ్యాంకర్లు సంబంధిత అధికారులు ఒరిజినల్ సర్టిఫికెట్లను పరిశీలిస్తారని ఆయన తెలిపారు దరఖాస్తు చేసుకున్న ప్రతి అభ్యర్థి ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు ఇది ఇలా ఉండగా పట్టణంలోని అన్ని వార్డులలో ఇ బి సి కింద సబ్సిడీ రుణాల కోసం చేసుకున్న అభ్యర్థులు అదే సమయంలో నగర పంచాయతీ కార్యాలయంలో ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని నగర పంచాయతీ కమిషనర్ సతీష్ కుమార్ తెలిపారు.

## పశు బీమా పథకాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలి

### -పశుసంవర్ధకశాఖ ఉరవకొండ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జి.వెంకటేష్

ఉరవకొండ, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త



విలేఖరులతో మాట్లాడుతున్న పశుసంవర్ధకశాఖ ఉరవకొండ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జి.వెంకటేష్

పశు బీమా పథకాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధకశాఖ ఉరవకొండ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జి.వెంకటేష్ సూచించారు. మంగళవారం ఆయన స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ అవులు, గేదెలకు పశు బీమాకై ఎస్సీ, ఎస్టీ, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు 15,000 రూపాయల బీమా కోసం 960 రూపాయలు ప్రీమియం చెల్లించాల్సి ఉండగా ప్రభుత్వ రాయితీ 768 రూపాయలు పోను రైతు 199 రూపాయలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. 30,000 రూపాయల బీమా కోసం 1,920 రూపాయలు ప్రీమియం చెల్లంచాల్సి ఉండగా ప్రభుత్వ రాయితీ 1,536 రూపాయలు పోనూ రైతు 398 రూపాయలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. 35,000 రూపాయల బీమా కోసం 2,240 రూపాయలు ప్రీమియం చెల్లించాల్సి ఉండగా రాయితీ 1,536 రూపాయలు పోనూ రైతు 729 రూపాయలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. 40,000 రూపాయలు బీమా కోసం 2,560 రూపాయలు ప్రీమియం చెల్లించాల్సి ఉండగా ప్రభుత్వ రాయితీ 1,536 రూపాయలు పోనూ రైతు 1,060 రూపాయలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. 45,000 రూపాయలు బీమా కోసం 2,880 రూపాయలు ప్రీమియం చెల్లించాల్సి ఉండగా ప్రభుత్వ రాయితీ 1,536 రూపాయలు పోనూ రైతు 1,392 రూపాయలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. 50,000 రూపాయలు బీమా కోసం 3,200 రూపాయలు ప్రీమియం చెల్లించాల్సి ఉండగా ప్రభుత్వ రాయితీ 1,536 రూపాయలు పోనూ రైతు 1,723 రూపాయలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. పశువులకు చెవిపోగు వేయించి బీమాలో నమోదు చేసుకోవాల్సి ఉంటుందని ఒకసారి బీమా చేస్తే 3 సంవత్సరాల వరకు వర్తింస్తుందని డీడీ డాక్టర్ జి.వెంకటేష్ వివరించారు.

## స్నేహితుల మధ్య ఆర్థిక లావాదేవీలతో వ్యక్తి ఆత్మహత్య కేసులో ఇద్దరి అరెస్టు

### -తన చావుకు కారణం వీరేనని సూసైడ్ నోట్ రాసిన మృతుడు

ఉరవకొండ, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త

స్నేహితుల మధ్య ఆర్థిక లావాదేవీల విషయంలో మనస్పర్థలతో పట్టణానికి చెందిన గుగ్గిళ్ళ కిషోర్‌కుమార్ అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న కేసులో నిందితులుగా ఉన్న ఇద్దరు వ్యక్తులు దాసరి కేదారానాథ్, కుమ్మరి హరికృష్ణలను మంగళవారం పట్టణ శివార్లలో అరెస్టు చేసినట్లు యుపీఎస్ సీఐ బి.మహానంది, ఎస్ఐ పి.జనార్ధననాయుడు తెలిపారు. గుగ్గిళ్ళ కిషోర్‌కుమార్ అనే వ్యక్తి పట్టణంలోని 6వ వార్డు కుమ్మరి వీధిలో నివాసముంటూ ఈనెల 8వ తేదీన ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని ఈక్రమంలోనే ఆయన నా చావుకు వీరే కారణమంటూ సూసైడ్ నోట్ కూడా రాశాడన్నారు. మృతుని భార్య సునీత పిర్యాదు మేరకు నలుగురు వ్యక్తులపై ఆత్మహత్యకు ప్రేరేపించిన కేసును నమోదు చేసి విచారణ చేపట్టామన్నారు. ఇందులో భాగంగానే దాసరి కేదార్‌నాథ్, కుమ్మరి హరికృష్ణలను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపర్చగా మేజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించారన్నారు. కేసులోని మరో ఇద్దరు నిందితులు సంజయ్, మురళీ అరెస్టు కావాల్సి ఉంది.

## ఆంధ్ర హ్యాండ్‌లూమ్‌కు ఇచ్చిన స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలి

### -పంచాయతీ కార్యదర్శికు విన్నవించిన డీసీసీ ఉపాధ్యక్షులు బ్యాళ్ళ శివప్రసాద్

ఉరవకొండ, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త



పంచాయతీ కార్యదర్శి ఏ.గౌస్‌సాహెబ్‌కు వినతిపత్రం అందిస్తున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు బ్యాళ్ళ శివప్రసాద్

ఉరవకొండ పట్టణంలోని అనంతపురం-బళ్లారి 42వ నంబర్ జాతీయ రహదారికి పక్కనగల సర్వే నంబర్ 530/పిలోని 13 సెంట్ల విలువైన స్థలాన్ని గ్రామ పంచాయతీ తిరిగి స్వాధీనం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బ్యాళ్ళ శివప్రసాద్ కోరారు. మంగళవారం ఆయన స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి ఏ.గౌస్‌సాహెబ్‌కు ఈ మేరకు వినతిపత్రం అందించారు. పంచాయతీ పాలకవర్గం 2005లో ఆంధ్ర హ్యాండ్‌లూమ్స్‌కు ఈ స్థలాన్ని చేనేతల ప్రయోజనం కోసం కేటాయించిందని అయితే అక్కడ చేనేతలకు ఉపయోగపడే విధంగా ఎలాంటి నిర్మాణాలు, కార్యకలాపాలు జరుగలేదన్నారు. పైగా స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులకు విక్రయించి సొమ్ము చేసుకోవడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఉన్న మార్కెట్ ధర మేరకు సదరు స్థలం సెంటు 15 లక్షల రూపాయలు ధర పలుకుతుందని పంచాయతీకు చెందిన ఈ స్థలంలో జరిగిన క్రయ విక్రయాలు, రిజిస్ట్రేషన్లను రద్దు చేస్తూ స్థలాన్ని పంచాయతీ తిరిగి స్వాధీనం చేసుకొని ప్రజా అవసరాలకు వినియోగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట డీసీసీ ప్రధాన కార్యదర్శి సోనియా శీనా ఉన్నారు.

## బాలికల హైస్కూల్‌లో అంగన్‌వాడీలకు శిక్షణా తరగతులు ప్రారంభం

### -ఐసిడిఎస్ సూపర్‌వైజర్ నాగరాణి ఆధ్వర్యంలో శిక్షణా తరగతులు

గోరంట్ల, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త



శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న నాయకులు

మండలంలోని అంగన్‌వాడి కార్యకర్తల కోసం ఏర్పాటు చేసిన జ్ఞానజ్యోతి శిక్షణా తరగతులు సద్వినియోగం చేసుకోవాలని ఐసిడిఎస్ సిడిపిఓ రాజేశ్వరి పిలువునిచ్చారు.



శిక్షణకు హాజరైన అంగన్‌వాడి కార్యకర్తలు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విద్యాశాఖ, స్త్రీ శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జ్ఞానజ్యోతి ట్రైనింగ్ సెంటర్ పేరుతో మండలంలోని 131 మంది అంగన్‌వాడి కార్యకర్తలకు ఆరు రోజుల పాటు శిక్షణా తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో రెండు సెంటర్లలో శిక్షణా తరగతులను మంగళవారం ప్రారంభించారు. ఇందులో భాగంగా ఈ కార్యక్రమాలకు సోమందేపల్లి ప్రాజెక్ట్ సిడిపిఓ రాజేశ్వరి, మండల విద్యాశాఖ అధికారులు గోపాల్, జాన్‌రెడ్డప్పలు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. గోరంట్ల మండల ఐసిడిఎస్ సూపర్‌వైజర్ నాగరాణి నేతృత్వంలో అంగన్‌వాడి కార్యకర్తలకు శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ నెల 18 నుండి 25వతేదీ వరకు జరిగే శిక్షణా తరగతుల్లో అంగన్‌వాడి కేంద్రాల్లోని ఆరు సంవత్సరాల వయసు పిల్లల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నైపుణ్యాలు, న్యూట్రీషియన్, భాషాభివృద్ధి వంటి మెలకువలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, చంద్రమోహన్, రామ్‌కుమార్, శ్రీనివాసులు, అంగన్‌వాడి కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయంగా నాయి బ్రాహ్మణులు ఎదిగితేనే మనుగడ.

- గోరంట్లలో....నాయి బ్రాహ్మణ జిల్లా విజయభేరి.....

-హాజరైన... రాష్ట్ర మాజీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్ర కోటి సదాశివం, మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప, బిజెపి జిల్లా అధ్యక్షులు జిఎం శేఖర్,



సమావేశంలో మాట్లాడుతున్న బిజెపి జిల్లా అధ్యక్షులు.

గోరంట్ల, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త

నాయీ బ్రాహ్మణులకు రాజకీయంగా, ఆర్థికంగా సామాజికంగా అభివృద్ధి చెందడానికి ప్రభుత్వాలు కృషి చేయాలని ఏపీ నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం కోరారు, అయితే నాయీ బ్రాహ్మణులు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనుకబడిపోయారని తెలిపారు, గోరంట్ల మండలం లోని జీనవాండ్లపల్లి వద్ద ఉన్న నాయి బ్రాహ్మణ కమిటీ భవన్ వద్ద గోరంట్ల శివాలయం ట్రస్ట్, గోరంట్ల మండల నాయి బ్రాహ్మణుల సంఘం ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు నాగభూషణం అధ్యక్షతన నాయి



నాయి బ్రాహ్మణులను ఉద్దేశించి మాట్లాడుతున్న మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప

బ్రాహ్మణ విజయభేరి సభ ఘనంగా నిర్వహించారు, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తిరుమల తిరుపతి దేవస్థానం కమిటీ మెంబర్ వైద్యం శాంతారామ్ హిందూపురం మాజీ పార్లమెంటు సభ్యులు నిమ్మల కిష్టప్ప ,శ్రీ సత్య సాయి జిల్లా బిజెపి అధ్యక్షుడు జిఎం శేఖర్, ఏపీ నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, గోరంట్ల సర్పంచ్ సరోజ నాగే నాయక్ ,శ్రీ మారెమ్మ దేవి ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ బి దేవి రాజస్వామి, మరియు రాష్ట్ర నలుమూలల నుంచి ఉన్నత స్థాయిలో ఉన్న నాయి బ్రాహ్మణ నాయకులు మరియు గోరంట్ల మండలం నాయి బ్రాహ్మణులు మండల అధ్యక్షులు కమిటీ సభ్యులు అత్యధిక సంఖ్యలో హాజరయ్యారు, ఈ కార్యక్రమానికి విచ్చేసిన నాయి బ్రాహ్మణులకు డాక్టర్ బి దేవి రాజస్వామి మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు, ఈ కార్యక్రమానికి రాష్ట్ర నలుమూల విచ్చేసిన నాయి బ్రాహ్మణ సోదరులందరికీ గోరంట్ల శివాలయం ట్రస్ట్ మరియు గోరంట్ల నాయి బ్రాహ్మణుల సంఘం తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్య క్రమంలో బిజెపి మండల కన్వీనర్ బోయ లక్ష్మి నారాయణ, బొట్టు శ్రీనివాసులు, శంకర్, తుకారం, తో పాటు తదితరులు పాల్గొన్నారు. బిజెపి జిల్లా అధ్యక్షుడు శేఖర్ కు సన్మానం.. గోరంట్ల మండల కేంద్రంలో జరుగుతున్న నాయి బ్రాహ్మణ జిల్లాస్థాయి విజయభేరి సభా కార్యక్రమాలకు విచ్చేసిన భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు జిఎం శేఖర్ గోరంట్ల మండల బిజెపి నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బిజెపి మండల అధ్యక్షులు లక్ష్మీనారాయణ, నియోజకవర్గ కన్వీనర్ బొట్టు శ్రీనివాసులు, యువ మోర్చా మండల అధ్యక్షులు కొర్రు ఆంజనేయులు ల ఆధ్వర్యంలో జిఎం శేఖర్ ను ఘనంగా సన్మానించారు.

## అగ్నికి ఆహుతైన సపోటతోట

### -లక్షలాది రూపాయల నష్టం



సపోట తోటలో మంటలు చెలరేగుతున్న దృశ్యం

లేపాక్షి, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త

మండల కేంద్రమైన లేపాక్షి వివేకానంద జిల్లా పరిషత్ పాఠశాల వెనుక 11 ఎకరాల్లో సాగులో వున్న సపోట తోట మంగళవారం అగ్నికి ఆహుతైంది. బెంగుళూరుకు చెందిన శివమూర్తి అనే వ్యక్తి 75 ఎకరాల్లో పండ్లతోటల పెంపకం చేపట్టారు. మంగళవారం మధ్యాహ్నం పొలంలో ఒకవైపు నిప్పు పడడంతో గడ్డి అంటుకుని 11 ఎకరాల్లో వున్న సపోట తోట కాలిపోయింది. దీంతో లక్షలాది రూపాయలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు.

## అంగన్‌వాడీలకు జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమం

లేపాక్షి, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త



అంగన్‌వాడీలకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

మండల కేంద్రమైన లేపాక్షిలోని ఉర్దూ ఉన్నత పాఠశాల సమావేశ భవనంలో అంగన్‌వాడీలకు జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. ఈ శిక్షణా కార్యక్రమాన్ని ఎంపిడిఓ నరసింహమూర్తి, ఎంఇఓ నాగరాజు, ఎంఇఓ-2 కుల్లాయప్పలు ప్రారంభించారు. ఈ శిక్షణలో చిన్నారులకు ఆటల ద్వారా అభ్యాసం ఏ విధంగా చేయించాలో అంగన్‌వాడీలకు అవగాహన కల్పించారు. అదేవిధంగా విద్యార్థుల్లో భాష అభివృద్ధి, గణితశాస్త్ర అభివృద్ధి ఏ విధంగా అభివృద్ధి పరచాలో తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు శ్రీలక్ష్మీ, మంజుల, ఉర్దూస్కూల్ హెడ్మాస్టర్ ఇర్షాద్, డిస్టిక్ ఆర్‌పిలు సురేష్‌బాబు. లక్ష్మినారాయణ, ఫణిభూషణ్‌రావు, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

## బెంగళూరు ఆస్పత్రిలో... రాజారెడ్డిని పరామర్శించిన చరణ్ రెడ్డి

గోరంట్ల, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త



రాజారెడ్డిని పరామర్శిస్తున్న చరణ్ రెడ్డి.

శ్రీ సత్య సాయి జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షులు, గోరంట్ల ఉప సర్పంచ్ రాజారెడ్డి ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ గత కొన్ని రోజులుగా బెంగళూరులోని యాస్టర్ సీఎం ఐ హాస్పిటల్ లో చికిత్స చేయించు కుంటుండగా మాజీ మంత్రి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షురాలు పెనుకొండ నియోజకవర్గం సమన్వయ కర్త ఉషాశ్రీచరణ్ భర్త చరణ్ రెడ్డి పరామర్శించారు, అలాగే ఆరోగ్య పరిస్థితి, యోగక్షేమాలు అడిగి తెలుసుకుని, అధైర్యపడవద్దు మీకు అండగా మేమున్నాం, అంటూ భరోసా కల్పించారు, అలాగే పట్టణ కన్వీనర్ మేదర శంకర్, ఉప సర్పంచ్ శ్రీనివాసులు, భక్తర్, సురేష్ రెడ్డి, నాగరాజు, సాయి కృష్ణ, దాదాపీర్, ప్రతాప్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## అందరికీ చదివే ముఖ్యం.

సిల్వర్ లైన్ స్కూల్ వార్షికోత్సవ వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే, మాజీమంత్రి పల్లె.




విద్యార్థులు ను అభినందిస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి

కొత్త చెరువు: ఫిబ్రవరి 18 ప్రభాతవార్త.

విద్యార్థులు బాగా చదువుకొని మంచి ప్రయోజకులు కావాలని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి విద్యార్థులకు సూచించారు. కొత్తచెరువు మండల కేంద్రంలోని సిల్వర్ లైన్ ఇంగ్లీష్ మీడియం ప్రైమరీ స్కూల్ వార్షికోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి తో పాటు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడలు అలవర్చుకోవాలని సూచించారు. ప్రతి మనిషికి చదువు ఎంతో ముఖ్యమని తెలిపారు. చిన్నారుల్లో నెలకొన్న ప్రతిభను ఉపాధ్యాయులు గుర్తించి వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని పాఠశాల ఉపాధ్యాయులకు సూచించారు. విజయవాడ వరద బాధితుల సహాయార్థం ఈ పాఠశాల నుంచి విద్యార్థులు అందించిన సహాయార్థం ఎనలేనిదని ఈ సందర్భంగా చిన్నారులను ఎమ్మెల్యే అభినందించారు. ఇలా చిన్నవయసులోనే చిన్నారులు తమవంతు సహాయాన్ని అందించడం ఎంతోగొప్ప విషయమని విద్యార్థులను అభినందించి వారికి మెమొంట్లను బహుకరించారు ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ షాకీర అబ్దుల్లా మండల టిడిపి సీనియర్ నాయకులు సాలక్క గారి శ్రీనివాసులు మండల పట్టణ కన్వీనర్ వలిటి శ్రీనివాసులు పాఠశాల ఉపాధ్యాయినీలు రమణి, దిల్షాన్ ,శ్రీదేవి, సాయిలీల, చందన, షాజహాన్, డ్యాన్స్ మాస్టర్ కామేష్ తదితరులు పాల్గొన్నారు

## రైతులకు సౌకర్యవంతంగా కందుల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయండి

జాయింట్ కలెక్టర్ అభిషేక్. మండలంలో నాలుగు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిన వ్యవసాయ అధికారులు.



కందుల కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్

రొద్దం. ఫిబ్రవరి 17 ప్రభాతవార్త.

మండల కేంద్రమైన రొద్దంలో చెక్ పోస్ట్ నందు గల రైస్ మిల్లులో కందుల కొనుగోలు కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ఆర్డిఓ ఆనంద్ కుమార్ వ్యవసాయ అధికారులు పరిశీలించారు. జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ కందుల కొనుగోలు కేంద్రం దగ్గర ఉన్న రైతులను పలు విషయాలు అడిగి తెలుసుకున్నాడు రైతులు వారి సమస్యలు తెలియజేస్తూ నాలుగు రోజులుగా కందుల సంచులను తీసుకుని వచ్చి ఇక్కడే పడికాపులు కాస్తున్నామని రాత్రింబవళ్లు ఇక్కడే ఉండవలసి వస్తుందని ఏజెన్సీ వారు కందుల సంచులను తీసుకెళ్లడం లేదని వ్యవసాయ అధికారులు జాప్యం చేస్తున్నారని రైతులకు సంచులు ఇవ్వకుండా ఒక్కో రోజు ఒక్కో రకమైన షరతులు పెడుతున్నారని జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా వ్యవసాయ అధికారులు మాట్లాడుతూ ఈరోజు నుండి నాలుగు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని రొద్దం రెడ్డిపల్లి లోచర్ల తురకల పట్నం కేంద్రాలో రైతులు ఎప్పటికప్పుడు సమాచారం అందించి కందుల సంచులను తీసుకొని వస్తే రిజిస్ట్రేషన్ లో చేసుకుంటామన్నారు రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఎప్పటికప్పుడు వారికి అందుబాటులో ఉండే విధంగా చూడాలని వ్యవసాయ అధికారులకు ఏజెన్సీ వారికి తెలియజేశాడు అనంతరం రొద్దం కంపల్లి గ్రామంలో భూ సర్వే కార్యక్రమంలో పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు రెవెన్యూ అధికారులు రైతులు పాల్గొన్నారు

## సైబర్ నేరాల పట్ల అవగాహన

గుత్తి, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నేటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంలో సైబర్ నేరగాళ్లు విచ్చలవిడిగా ప్రజల ధనాన్ని దోచుకుంటున్నారని వాటి పట్ల అవగాహన కల్పించుకోవాలని పోలీస్‌శాఖ సూచించింది. జిల్లా ఎస్పి జగదీష్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా సైబర్ నేరాల పట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ మేరకు ప్రత్యేకంగా రూపొందించిన వాహనంలో ప్రదర్శనాత్మకంగా ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాన్ని చేపట్టారు. మంగళవారం గుత్తి శివారులోని గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల, జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల, ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలు తప్పుడు ఫోన్ సమాచారం కారణంగా ప్రలోభాలకు గురికారాదని, ఫేక్ ఫోన్‌కాల్‌కు స్పందించరాదని విద్యార్థులకు సూచించారు. తద్వారా సందేశమును తమ తల్లిదండ్రులకు సంరక్షకులకు చేరవేయాలని వీడియోలో సూచించారు. అదేవిధంగా డిజిటల్ అరెస్ట్ లాంటి బెదిరింపులు, సులభంగా డబ్బులు సంపాదించడం అనే యాప్‌ల పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఆశాబేగం, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## నాటి స్టూడెంట్స్ బాధ్యతగా బడికి మైక్‌సెట్ వితరణ

గోరంట్ల, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త



మైక్‌సెట్ అందచేస్తున్న పూర్వ విద్యార్థులు

పట్టణంలోని ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో 1974-75 సంవత్సరంలో 10వ తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ నాడు చదువుకున్న స్కూల్‌కు అండగా నిలుస్తూ విద్యార్థుల సౌకర్యార్థం అధునాతనమైన మైక్‌సెట్‌ను వితరణ చేశారు. ఇటీవల ఈ పూర్వ విద్యార్థులు పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసుకుని స్కూల్‌కు ఎంతో కొంత చేయూత ఇవ్వాలని తీర్మానించుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు మాధవిలత సమక్షంలో పూర్వ విద్యార్థులు కృష్ణారెడ్డి, సోమనాథరెడ్డి, లక్ష్మీరెడ్డి, రవీంద్రనాథ్ ఠాగూర్, ఖాజామియా, విశ్వనాథ్‌ల సమక్షంలో మైక్‌సెట్‌ను అందచేశారు. ఈ సందర్భంగా హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు మాధవిలత మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు సాయం అందించడంపై అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వైసిపి పార్టీని వీడి టీడీపీలోకి వలసల జోరు..!



ఎమ్మెల్యే రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి సమక్షంలో టీడీపీలో చేరిన వైసిపి కార్యకర్తలు,

మడకశిర టౌన్ ఫిబ్రవరి 18 ప్రభాతవార్త,

మండల పరిధిలోని వైబిహల్లి గ్రామపంచాయతీ బుద్దయ్యపాళ్యం, కరేశంకనపల్లి . తదితర గ్రామాల నుండి వైసిపి పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలోకి వలసల పర్వం మొదలైంది. మంగళవారం పట్టణంలో ఆర్అండ్‌బి విశాంత్ భవనంలో టిడిపి సర్పంచ్ రామాంజనేయులు, రవీంద్రారెడ్డి శ్రీనాథ్ రెడ్డి లక్ష్మీనారాయణ శివశంకర్ల ఆధ్వర్యంలో టిటిడి బోర్డు మెంబర్ ఎమ్మెల్యే రాజు ,మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి సమక్షంలో వివిధ సామాజిక వర్గాలకు చెందిన వారు పెద్దసంఖ్యలో దాదాపు 25 కుటుంబాలు నుండి వైసీపీ పార్టీ ని వీడి టీడీపీలోకి చేరారు. టిడిపి పార్టీలోకి చేరిన వారికి ఎమ్మెల్యే రాజు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పసుపు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు . నిత్యం భారీ చేరికలు ఉంటుండటంతో శ్రేణులు మరింత జోష్‌తో ముందుకు సాగుతుండగా వైసీపీ నేతలు ఆందోళన చెందుతున్నారు. గత పక్షంరోజులుగా ఈ రెండు నెలల నుండి నియోజకవర్గంలో ప్రతిరోజూ ఏదో ఒక ప్రాంతం, ఏదో ఒక సామాజికవర్గం వారు వైసీపీని వీడి టీడీపీలో చేరుతూనే ఉన్నారు. దీంతో స్థానికంగా పార్టీకి అండగా ఉన్న నేతలను సమన్వయం చేసుకుంటూ టిడిపి పార్టీలోకి ఆహ్వానిస్తున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ మూర్తి, ఐదు మండలాల కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా నందమూరి తారకరత్న రెండవ వర్ధంతి వేడుకలు..!



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రాజు,మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి

మడకశిర టౌన్ ఫిబ్రవరి 18 ప్రభాతవార్త,

మడకశిర పట్టణంలోని ఆర్ అండ్ బి విశ్రాంతి భవనంలో మంగళవారం నందమూరి తారకరత్న రెండవ వర్ధంతి వేడుకల్లో టీటీడీ బోర్డు మెంబర్ , ఎమ్మెల్యే రాజు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు,మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిలు పార్టీనాయకులు కార్యకర్తలతోకలిసి నందమూరి తారకరత్న జయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు .ఈ కార్యక్రమంలో జడ్పిటిసి ఉమేష్ కన్వీనర్లు లక్ష్మీనారాయణ, దాసి రెడ్డి, గణేష్, కుమార్ స్వామి సీనియర్ నాయకులు గురుమూర్తి స్వామి, జిల్లా కురుభ అధ్యక్షులు గోవిందప్ప, క్లస్టర్ ఇన్చార్జిలు, నాగరాజు, భరత్, ప్రసాద్, మైనార్టీ నాయకులు దాదు, నాయకులు , కార్యకర్తలు ,తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం చేస్తే శాఖా పరమైన చర్యలు..!

## డివిజన్ బీసీ వెల్ఫేర్ అధికారి గంగాధర్

మడకశిర టౌన్ ఫిబ్రవరి 18 ప్రభాతవార్త



సమావేశంలో హాస్టల్ వార్డులతో మాట్లాడుతున్న డివిజన్ బీసీ వెల్ఫేర్ అధికారి గంగాధర్

నియోజకవర్గంలోని బీసీ హాస్టల్లో చదువుకుంటున్న బాల,బాలికలు పట్ల వార్డెన్లు ఏమాత్రం నిర్లక్ష్యం వహించిన శాఖా పరమైన చర్యలు ఉంటాయని డివిజన్ బీసీ వెల్ఫేర్ అధికారి గంగాధర్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని బాలుర జూనియర్ కళాశాల హాస్టల్ వార్డెన్లతో ఆయన సమావేశం నిర్వహించారు,విద్యార్థుల ప్రగతి సౌకర్యాలు భోజన పథకం నిర్వహణ తదితర వాటిపై ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా డివిజన్ బీసీ వెల్ఫేర్ అధికారి గంగాధర్ మాట్లాడుతూ : హాస్టల్లో చదువుకుంటున్న విద్యార్థులను ఆప్యాయంగా ఉంటూ వారి విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ముఖ్యంగా విద్యార్థుల పట్ల దురుసుగా ప్రవర్తించడం మంచి పద్ధతి కాదన్నారు అదేవిధంగా విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం వండించి వడ్డించలన్నారు.రాత్రి సమయంలో విద్యార్థులకు అందుబాటులో ఉండాలన్నారు విద్యార్థుల విద్యాభివృద్ధికి వార్డెన్లు సమిష్టిగా కృషి చేయాలన్నారు ,ఈ కార్యక్రమంలో ఐదు మండలాల వార్డెన్లు , హాస్టల్ సిబ్బంది , తదితరులు పాల్గొన్నారు ,

# నేడు వారపు సంత,చింతపల సాయం, వాహనాల పార్కింగ్ వేలంపాట

అమరాపురం ఫిబ్రవరి 18 ప్రభాతవార్త



గ్రామ కార్యదర్శి నరేష్ బాబు

మండల పరిధిలోని హేమావతి గ్రామ సచివాలయంలో సర్పంచ్ తిప్పేస్వామి అధ్యక్షతన విస్తరణ అధికారి నాగముని ఆధ్వర్యంలో బుధవారం శ్రీ హేంజేరు సిద్దేశ్వర స్వామి బ్రహ్మోత్స వాలు సందర్భంగా వచ్చే వాహనాల పార్కింగ్ , దుకాణాల వారితో రుసుము వసూలు చేయుట, 202425 ఆర్థిక సంవత్సరం గానూ బహిరంగ వేలం వేయుటకు గ్రామ పంచాయతీ సభ్యులు నిర్ణయించడం జరిగిందని గ్రామ కార్యదర్శి నరేష్ బాబు తెలిపారు.అదే విధంగా ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న వారపు సంత, చింత చెట్ల ఫల సాయం ను కూడా బహిరంగ వేలం వేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.కావున ఆసక్తి గల వారు పదివేలుడిపాజిట్ చెల్లించి వేలం లో పాల్గొనవచ్చని, వేలంలో పాల్గొనదలచిన వారు పంచాయతీకి ఎటువంటి బకాయిలు ఉండరాదన్నారు.

# పాఠశాల ఆకస్మిక తనిఖీ

అగళి, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త



విద్యార్థులతో చర్చిస్తున్న ఎంఈఓ

మండల పరిధిలోని ఇనగలూరు ఉన్నత పాఠశాలను ఎంఈఓ చంద్రశేఖర్ నాయుడు ఆకస్మికంగా తనిఖీ చేశారు. 10వ తరగతి విద్యార్థులకు 100 రోజుల ప్రణాళికతో ప్రత్యేకంగా ప్రణాళికను అమలు చేసి వారికి విద్యా బుద్దులు నేర్పుతున్నారని ఎంఈఓ తెలిపారు. స్టూడెంట్స్ ను, టీచర్స్ ను కలిపి పబ్లిక్ పరీక్షకు ఎలా విద్యార్థులను సన్నద్ధం చేయాలో వారికి వివరించారు.

# బాల్యదశ నుండే విద్యాభ్యాసంపై మక్కువ పెంపొందించాలి..

## అంగన్వాడీ కార్యకర్తల శిక్షణలో యంఈఓలు



జ్ఞాన జ్యోతి శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈఓలు,రిసోర్స్ పర్సన్ లు

బత్తలపల్లి, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త

బాల్యదశ నుండే చిన్నారులలో విద్యాభ్యాసంపై శ్రద్ధ పడేలా చూడాలని ఎంఈఓ లు చాముండేశ్వరి, సుధాకర్ నాయక్ లు అంగన్వాడీ కార్యకర్తలకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జ్ఞాన జ్యోతి కార్యక్రమంలో భాగంగా మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలకు ఆరు రోజుల శిక్షణ తరగతులు ప్రారంభమైనాయి.ఈ సందర్భంగా యంఈఓలు మాట్లాడుతూ జాతీయ



శిక్షణకు హాజరైన అంగన్వాడి టీచర్లు

విద్యా విధానం2020 అమలులో భాగంగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రముఖ విద్యా సంస్థల సహకారంతో జ్ఞానజ్యోతి పేరుతో అంగన్వాడీ కార్యకర్తలకి 120 రోజులపాటు వివిధ రకాల శిక్షణలు అందిస్తుందన్నారు. అందులో భాగంగా మొదటగా ఆరురోజుల శిక్షణ ప్రారంభమైందన్నారు.ముఖ్యంగా పూర్వ బాల్యదశ నుండి విద్యపట్ల ఆవశ్యకతను కల్పించేలా ఆటపాటల కేంద్రాలుగా అంగన్వాడీ కేంద్రాలను తీర్చిదిద్దాలని సూచించారు.రాబోయే రోజులలో పూర్వ ప్రాథమిక విద్యను అందించేందుకు సమీప పాఠశాలలో ఒకటి,రెండు తరగతుల విద్యార్థులకు బోధన జరుగుతుందన్నారు.ఈ శిక్షణలో పలు అంశాలపై జిల్లా రీసోర్స్ పర్సన్స్ నాగేశ్వరయ్య, నాగశేషణ,రామసుబ్బారెడ్డిలు సవివరంగా, అర్థవంతంగా వివరించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు జయంతి, సరళ,ఐసీడీఎస్ సూపర్వైజర్ దేవమణి బాలిక విద్య ఆవశ్యకతను తెలుపుతూ బాల్యదశలో జరిగే వివాహాల వల్ల జరిగే నష్టాలను వివరించారు.ఈ కార్యక్రమంలో సీఆర్పీలు సునీత,వెంకటరమణ,గోవింద రెడ్డి,ఆపరేటర్ చంద్రయ్యలతో పాటు సిబ్బంది,అంగన్వాడీ కార్యకర్తలు హాజరయ్యారు.

# మండల వైయస్ఆర్‌సిపి కన్వీనర్‌ను సన్మానించి భూడిమేపల్లి గ్రామస్తులు

బ్రహ్మ సముద్రం.ఫిబ్రవరి.19. ప్రభాతవార్త



కన్వీనర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

మండలం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నూతన కన్వీనర్ పాల బండ్ల చంద్రశేఖర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో పూలమాలతో సన్మానం చేసి శుభకాంక్షలు తెలియజేసిన బుడిమేపల్లి వైసీపీ నాయకులు కార్యకర్తలు.

# కార్పొరేషన్ రుణాల కోసం ఇంటర్వ్యూలు

అమరాపురం ఫిబ్రవరి 18 ప్రభాతవార్త



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న దృశ్యం

మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయం నందు కార్పోరేషన్ రుణాల కోసం ఇంటర్వ్యూలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హేమావతి ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ పరిధిలో 74 మంది దరఖాస్తు చేసుకోగా 44 మంది ఇంటర్వ్యూలో హాజరైనారు. అమరాపురం కెనరా బ్యాంక్ మరియు యూనియన్ బ్యాంక్ పరిధిలో వివిధ కార్పొరేషన్ రుణాల కోసం 104 మందిదరఖాస్తు చేసుకోగా 72 మంది ఇంటర్వ్యూలకు హాజరైనట్లు అడ్మినిస్ట్రేషన్ అధికారి ఆరాధ్య తెలిపారు ఈ కార్యక్రమంలో హేమావతి ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ ఎన్ రవీంద్ర నాయక్, అమరాపురం యూనియన్ బ్యాంక్ మేనేజర్ రాజేష్ పాల్గొన్నారు.వివిధ శాఖల అధికారులు అభ్యర్థులు బ్యాంక్ సిబ్బంది తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

# గొడవ పడిన డ్రమ్స్ కళాకారులు

## ఎస్సీ ఎస్టీ కేసు నమోదు



ఘర్షణలో గాయపడిన నరేంద్ర

బత్తలపల్లి, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త

రెండు వర్గాల డ్రమ్స్ కళాకారుల మధ్య నెలకొన్న మనస్పర్థల వలన గొడవ పడగా ఒకరు తీవ్రంగా గాపడ్డారు. పోలీసులు నిందితులపై హత్యాయత్నం,ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ సోమశేఖర్ తెలిపారు.పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని ఉప్పర్లపల్లి క్లాస్ వద్ద ఈనెల16న అర్ధరాత్రి సమయంలో గుమ్మల కుంట గ్రామానికి చెందిన నల్లబోయినపల్లి నరేంద్ర, కోడెకండ్ల గ్రామానికి చెందిన నారాయణస్వామి, గరిశనపల్లి గ్రామానికి చెందిన ఏకిల సందీప్ మధ్య డ్రమ్స్ ప్రోగ్రాం విషయమై ఘర్షణ చోటుచేసుకుంది. నారాయణస్వామి,సందీప్లు తమతో తెచ్చుకున్న కొడవలితో నరేంద్ర తలపై దాడిచేయగా తలకు తీవ్ర గాయమైంది. వెంటనే నరేంద్రను బత్తలపల్లి ఆర్డీటి ఆసుపత్రికి తరలించారు. బాధితుడుఇచ్చిన ఫిర్యాదుమేరకు నారాయణ స్వామి, సందీప్ ఇరువురిపై హత్యా ప్రయత్నం,ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఘర్షణ విషయంలో రాజకీయ ప్రమేయము లేదని కేవలము డ్రమ్స్ ప్రోగ్రామ్స్ విషయంలో మనస్పర్థల వల్ల ఘర్షణ చోటు చేసుకుందని పోలీసులు తెలిపారు.

# నేడు మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తుల పరిశీలన

## -మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి బి.వి.రవికుమార్

ఉరవకొండ, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త

బీసీ, ఈబీసీ, కమ్మ, రెడ్డి, వైశ్య, బ్రాహ్మణ, మేదరి, కుమ్మరి శాలివాహన, కాపు (బలిజ, ఒంటరి, తెలగ) కార్పొరేషన్ రుణాలు, జనరిక్ మెడికల్ దుకాణాల కోసం దరఖాస్తు చేసిన అభ్యర్థుల దరఖాస్తుల పరిశీలన ఈనెల 19వ తేదీన బుధవారం ఉరవకొండ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరుగుతుందని ఎంపీడీవో బి.వి.రవికుమార్ తెలిపారు. మంగళవారం ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 10.30 గంటల నుండి దరఖాస్తుల పరిశీలన మొదలు కానుండగా ఉదయం ఉరవకొండ పట్టణం, మధ్యాన్నం నుండి మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన అభ్యర్థుల దరఖాస్తులను పరిశీలించడం జరుగుతుందన్నారు. దరఖాస్తు చేసిన అభ్యర్థులు ఆధార్, రేషన్‌కార్డు, కులధృవీకరణ, ఆదాయ ధృవీకరణ, బ్యాంకు ఖాతా, ఓబీఎంఎంఎస్ దరఖాస్తులు తీసుకొని హాజరు కావాల్సి ఉంటుందని ఎంపీడీవో వివరించారు.

# ఎమ్మెల్యేకు ఘన సన్మానం



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న దృశ్యం

అగళి, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త

మండల పరిధిలోని నర్సాంబూది గ్రామంలో గత రెండు రోజులుగా కొల్హాపురి మహాలక్ష్మి జారత వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ జాతర వేడుకలకు ఎమ్మెల్యే ఎంఎస్.రాజు హాజరై దేవి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఫైనాన్స్ నారాయణప్ప దుశ్శాలువాతో మైసూర్ పేటతో, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే జాతరలో కలియ తిరుగుతూ ప్రజలతో మమేకమయ్యారు. చాలా మహిమగల దేవత అని దేవత ఆశీర్వాదం తీసుకుంటే భక్తులు అధిక సంఖ్యలో ఈ వేడుకల్లో పాల్గొన్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

# ఎస్సీ,ఎస్టీ కేసుపై విచారణలో పాల్గొన్న డి.ఎస్.పి

అమరాపురం ఫిబ్రవరి18 ప్రభాతవార్త



విచారణ చేస్తున్న డిఎస్పి దృశ్యం

మండల పరిధిలో వాలంకూరాం గ్రామంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల లో ఎస్సీ ఎస్టీ కేసు దర్యాప్తు భాగంగా పెనుకొండ డిఎస్పి వై. వెంకటేశ్వర్లు మంగళవారం విచ్చేసి సాక్షులను మడకశిర రూరల్ సీఐ ఏ.రాజ కుమార్ అమరాపురం ఎస్ఐ ఇషాక్ బాషా సమక్షంలో విచారణ చేపట్టారు. అనంతరం పాఠశాలలోని విద్యార్థినులకు బాల్య వివాహంతో పాటు సైబర్ క్రైమ్ ల గురించి అవగాహన కల్పించారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ప్రభుత్వం బాలికల విద్యనుప్రోత్స హించాలనే ఉద్దేశంతో కోట్లాది రూపాయలు వెచ్చించి నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిఎస్పీ కోరారు. అదేవిధంగా ప్రభుత్వ ఆశయాల కొనగుణంగా విద్యాబోధనను విద్యార్థులకు అందించి మంచి ప్రయోజకులుగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయ బృందాన్ని కోరారు.

# నింబగల్లులో ఏకగ్రీవమైన ప్రాథమిక గొర్రెల సహకార సంఘం ఎన్నిక

## -అధ్యక్షులుగా ఇంద్రాళ్ల ఆంజనేయులు, ఉపాధ్యక్షులుగా ఏరూరు ఎర్రమ్మ

ఉరవకొండ, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త



ఏకగ్రీవంగా ఎన్నికైన ప్రాథమిక గొర్రెల సహకార సంఘం అధ్యక్షులు ఇంద్రాళ్ల ఆంజనేయులు, ఉపాధ్యక్షులు ఏరూరు ఎర్రమ్మ

మండల పరిధిలోని నింబగల్లు గ్రామంలో మంగళవారం జరిగిన ప్రాథమిక గొర్రెల పెంపకందారుల సహకార సంఘం ఎన్నిక ఏకగ్రీవమైంది. స్థానిక సచివాలయంలో గుంతకల్లు మండల పశువైద్యాధికారి డాక్టర్ పల్లా మహేష్, పశు సంవర్ధక సహాయకులు రెడ్డిమాసి అనీల్ ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో సంఘం అధ్యక్షులుగా ఇంద్రాళ్ల ఆంజనేయులు, ఉపాధ్యక్షులుగా ఏరూరు ఎర్రమ్మ ఎన్నికయ్యారు. వీరితోపాటు డైరెక్టర్లుగా బొడ్రాయి చిన్న తిప్పన్న, కురుబ రామచంద్ర, కప్పల ఓలన్న, సింపిరి హనుమంతు, సాగబండ సుంకన్న ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ బాధ్యులు మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, టీడీపీ సీనియర్ నేత పయ్యావుల శ్రీనివాసులు సహకారంతో సంఘాన్ని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు కొంకా సిద్దప్ప, కె.వెంకటేశులు, జెట్టి సూరిబాబు, తిమ్మరాజు, పర్వతప్ప, సురేష్, పుల్లన్న, రామాంజినేయులు, వన్నూరుస్వామి తదితరులు పాల్గొన్నారు.

# జ్ఞానజ్యోతి సర్టిఫికేట్ కోర్సుపై అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ

## -హాజరైన ఎంఈవోలు, సీడీపీఓ, శిక్షణ ఇచ్చిన డీఆర్‌పీలు

ఉరవకొండ, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త



శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్న మండల విద్యాధికారులు హెచ్.ఈశ్వరప్ప, ఎంఈవో-2 పి.రమాదేవి, డీఆర్‌పీలు సంజీవకుమార్, వెంకటేశులు, సక్రియా నాయక్



హాజరైన మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు

పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి సర్టిఫికేట్ కోర్సు శిక్షణా కార్యక్రమం ప్రారంభమైంది. మండల విద్యాధికారులు హెచ్.ఈశ్వరప్ప, పి.రమాదేవి, ఐసీడీఎస్ సీడీపీఓ డా॥బి.ఎన్.శ్రీదేవి సమక్షంలో డిస్ట్రిక్ట్ రీసోర్స్ పర్సన్లు సంజీవకుమార్, వెంకటేశులు సక్రియా నాయక్ అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. సాల్ట్ (సపోర్టింగ్ ఆంధ్ర లర్నింగ్ ట్రాన్స్ ఫర్మేషన్) సమగ్రశిక్ష, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్తంగా ప్రపంచ బ్యాంకుతో చేసుకున్న ఒప్పందం మేరకు అంగన్‌వాడీ కార్యకర్తలకు 3 సంవత్సరాలపాటు 120 రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ప్రతి ఏడాది 40 రోజులు శిక్షణ కొనసాగనుండగా అందులో 6 రోజులు ఆఫ్‌లైన్‌లో, మిగిలిన 36 రోజులు ఆన్‌లైన్‌లో శిక్షణ కొనసాగనుంది. మొదటి విడతలో భాగంగా ఈ శిక్షణ ప్రారంభంకాగా ఎఫ్ఎల్ఎన్ (పూర్వ ప్రాథమిక విద్యలో భాషాభివృద్ధి, అంకెలను నేర్పించడం) అంశంపై శిక్షణ కొనసాగింది. ఈ శిక్షణా కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం పి.అనితకుమారి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు తిరుపాల్‌బాయి, రబీమా, రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

# బూదగవి సూర్యనారాయణస్వామి హుండీ ఆదాయం రూ.85,177

## -లెక్కింపులో పాల్గొన్న ఆలయ కార్యనిర్వహణ అధికారి, ఇన్‌స్పెక్టర్

ఉరవకొండ, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త



హుండీ లెక్కింపును పర్యవేక్షిస్తున్న సమూహ ఆలయాల కార్యనిర్వహణ అధికారి కె.విజయ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ కె.రాణి

ఉరవకొండ మండల పరిధిలోని బూదగవి గ్రామంలో వెలసిన ప్రసిద్ధ సూర్యనారాయణస్వామి ఆలయ హుండీ ఆదాయం 85,117 రూపాయలు సమకూరిందని ఆలయ కార్యనిర్వహణ అధికారి కె.విజయ్‌కుమార్ తెలిపారు. ఈనెల 4వ తేదీన జరిగిన రథసప్తమి పర్వదినం సందర్భంగా భక్తులు ఆలయంలోని రెండు శాశ్వత హుండీల ద్వారా సమర్పించి కానుకలను మంగళవారం దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ కె.రాణి, సూర్యనారాయణస్వామి ఆలయ సేవా సమితి అధ్యక్షులు సి.చిరంజీవి తదితరుల సమక్షంలో తెరిచి లెక్కించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు ప్రకాష్‌స్వామి, ఆలయ సేవా సమితి సభ్యులు మహేంద్రగౌడ్, ఉరవకొండ సమూహ ఆలయాల కార్యాలయం సిబ్బంది పి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ

బెలుగుప్ప, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త



శిక్షణ ఇస్తున్న అధికారులు

బెలుగుప్ప మండలకేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాధికారి మల్లారెడ్డి, ప్రధానోపాధ్యాయులు వెంకట ప్రసాద్ ఆధ్వర్యంలో జ్ఞాన జ్యోతిపేరుతో 120రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా మండల విద్యాధికారి మాట్లాడుతూ.. పిల్లలకు 3,4 సంవత్సరాల వయస్సుగల పునాదులను ఫ్రీ స్కూల్ చదివించాలని అందుకోసమే పిల్లల్లో అభివృద్ధి నైపుణ్యాన్ని సాధించే వరకు పిల్లలకు బోధించాలని వారికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 50 మంది అంగన్‌వాడీ టీచర్లు, ఆర్‌పిలు ఫకృద్దీన్, మోహన్‌రాజు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఉదయం 10 నుంచి సాయంత్రం 4 వరకు ఎండలో తిరగొద్దు

## -రాకెట్లలో వడదెబ్బపై అవగాహన కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది

ఉరవకొండ, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త



వడదెబ్బపై అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది

ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు వీలైనంతవరకు ఎండలో తిరగవద్దని హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ షఫీ, సూపర్‌వైజర్ శేఖర్ సూచించారు. రాకెట్ల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం మండల పరిధిలోని రాకెట్ల గ్రామంలో ప్రజలకు వడదెబ్బపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటి నుండి బయటకు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా పాదరక్షలు వేసుకోవాలని, తలకు టోపీ లేదా తలపాగా ధరించాలని సూచించారు. ఎండలో పనిచేసినపుడు తలనొప్పి, తలతిరగడం, నీరసం, జ్వరం, నాలుక ఎండిపోవడం, సృహకోల్పోవడం లాంటి లక్షణాలు ఎవరిలోనైనా కనిపిస్తే వెంటనే అలాంటి వారిని దగ్గరిలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం పద్మావతి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

# నేడు టిడిపి తీర్థం పుచ్చుకోనున్న అమరాపురం వైకాపా జడ్పిటిసి?

అమరాపురం ఫిబ్రవరి 18 ప్రభాతవార్త

అమరాపురం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జడ్పిటిసి స్వారక్క నరసింహ మూర్తి తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకోనున్నట్లు సమాచారం. మడకశిర ఆర్ అండ్ బి అతిథి గృహం నందు మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు ,మడకశిర నియోజకవర్గ టిడిపిఇన్చార్జ్ మాజీఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిల సమక్షంలో టిడిపిపార్టీలో బుధవారం చేరడానికి సిద్ధమైనట్లు టిడిపి వర్గాలు తెలిపాయి. జడ్పిటిసి తన అనుచరగణంతో టిడిపి పార్టీలో చేరడానికి సిద్ధమైనట్లు సమాచారం. అమరాపురం మండలం నుండి తెలుగుదేశం పార్టీలో వైకాపా పార్టీ నుండి జడ్పిటిసి తో పాటు నాయకులు కూడా చేరడానికి సిద్ధమైనట్లు సమాచారం. పూర్తి సమాచారం నేడు తేలాల్సి ఉంది

# కుటుంబ సమస్యలతో...మహిళ ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, ఫిబ్రవరి 18 ప్రభాత వార్త




ఆసుపత్రి ఫైల్ ఫోటో.

మండలంలోని వెంకటరమణ పల్లి గ్రామానికి చెందిన భారతీ అను మహిళ కుటుంబ కలహాలతో పురుగుమందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన చోటుచేసుకుంది, దీంతో పురుగుల మందు సేవించి అపస్మారక స్థితిలో పడి ఉండగా కుటుంబ సభ్యులు వెంటనే కనుకొని గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు,మెరుగైన వైద్యం కోసం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

# గొడవలకు దూరంగా ఉండండి...!

## సైబర్ క్రైమ్ పై గ్రామస్తులకు అవగాహన కలిగిస్తున్న పోలీసులు

ధర్మవరం రూరల్ ఫిబ్రవరి 18 ప్రభాతవార్త

గొడవలకు దూరంగా ఉండాలని సమస్య ఏదైనా ఉంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలని గరుడంపల్లి గ్రామ ప్రజలకు గ్రామీణ పోలీసులు తెలియజేశారు. మంగళవారం గ్రామంలో ఎస్ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో తమ సిబ్బందితో కలిసి గ్రామంలో ఏర్పాటుచేసిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ గ్రామంలో గొడవలకు, పేకాటకు, దూరంగా ఉంటూ మద్యానికి బానిస కాకుండా ఉండాలని సైబర్‌క్రైమ్‌పైన అవగాహన పెంచుకోవాలని మహిళలపై జరుగుతున్న దాడులు, సంఘటనలు నేరాలపై గరుడంపల్లి గ్రామ ప్రజలకు గ్రామీణ ఎస్సై శ్రీనివాసులు అవగాహన కల్పించడం జరిగింది.



సైబర్ క్రైమ్ పై గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

